# బ్రహ్మాస్త్రం

చిన్నప్పుడు మీగడ, వెన్న ఇష్టంగా తినడం (అప్పుడప్పుడు అమ్మ చూడకుండా), నాన్నగారు ఎందుకైనా కోప్పడితే పిల్లిలా తలుపు వెనకాతల నక్కడం తప్పించి, నాకూ పిల్లికీ ఏ విధమైన సంబంధం గానీ సంపర్కంగానీ లేదు చిన్నప్పటి నుంచీ

ఓ పిల్లి మా ఇంట్లో పాలుకాచే దాలి గుంటలో పడుకునేది మధ్యాహ్నం. పొద్దున్నే కుండలో పాలు కాచి, పదిగంటల ప్రాంతంలో దాలి గుంటలోంచి తీసి వంటింట్లో పెట్టుకునేది మా అమ్మ. మధ్యాహ్నానికి నిప్పు చల్లారిపోయాక దాలి గుంటలో పడుకునేది రాత్రి దాకా. ఆ పిల్లి ఏ రంగులో ఉండేదో నాకు గుర్తులేదు. దాన్ని ఎప్పుడూ పరిశీలనగా చూడలేదు ఆ పిల్లికి ఎప్పుడూ ఎవరూ పిలిచి పాలు పొయ్యలేదు. పెరట్లో పందికొక్కులు ఉండేవి కాని, ఇంట్లో ఎలకలు అంతగా ఉండేవి కావు. ఆ పిల్లి ఏం తిని, ఏం తాగి బ్రతికేదో నాకు తెలియదు.

మా అమ్మకి మడి, ఆచారం ఎక్కువ. అందుకని కుక్కల్నీ, పిల్లుల్నీ మా ఇంట్లోకి ఏనాడూ రానివ్వలేదు. అలాగని మా అమ్మకి భూత

దయ లేకపోలేదు. ఓ రోజు తెల్లవారుగట్ల మా అమ్మ మేలుకొలుపు పాటలు పాడుకుంటూ వంటింట్లో మజ్జిగ చేసుకుంటోందిట. అంతలో పెరట్లో నూతిలోంచి బుడుంగుమని శబ్దం అయిందిట. ఇంత పొద్దున్నే లేచి నూతిలో చాద ఎవరు వేశారు చెప్మా అని ఆశ్చర్యపోతూ వెళ్లిందిట. అప్పుడు నూతిలోంచి మ్యావ్ మ్యావ్ మంటూ వినిపించిందిట. పిల్లి నూతిలో పడిపోయి, నూతిలోపలి అంచుని పట్టుకుని ఏడుస్తోందిట. మా అమ్మ జాలిపడి, వెంటనే బాల్చీని నూతిలోకి వేసి, పిల్లి బాల్చీపట్టుకున్నాక తాడు మెల్లిగా పైకి లాగి, పై గట్టు దాకా వచ్చాక మా అమ్మ చెయ్యి ముందుకి చాపి బాల్చీని అందుకోబోతూంటే, ఆ పిల్లి భయపడిపోయి అమ్మ చేతిని కటుక్కున కొరికి ఒక్క దూకు బయటికి దూకి పారిపోయిందిట. పొద్దున్నే షేమంతా నిద్రలేచేసరికి చేతికి కట్టు కట్టుకుని కూర్చునుంది. ఏదో గృహ వైద్యం చేశారు. రెండు మూడు రోజులయాక చేతికి చీము పట్టింది. జ్వరం కూడా వచ్చింది. అప్పుడు మా నాన్నగారు డాక్టర్ని పిలుచుకొచ్చారు. చెయ్యి సలుపుతో, జ్వర తీవ్రతతో చాలా బాధపడింది మా అమ్మ. నెల రోజుల పాటు మంచం దిగలేదు.

అప్పటి నుంచీ పిల్లి అంటే భయం పట్టుకుంది నాకు. ఆదమరపుగా ఉన్నప్పుడు వంటింట్లో దూరి పాలగిన్నె, పెరుగుగిన్నె మూతలు పడగొట్టి పాలూ పెరుగూ కాజేస్తుందన్న భయమేకాక, దగ్గర కెడితే కరుస్తుందేమో నన్న భయం కూడా పట్టుకుంది నాకు. దూరం నుంచే ఏ కర్రో పుచ్చు కుని భయపెట్టడం తప్ప, ఎప్పుడూ దగ్గరగా వెళ్లలేదు ఇప్పటి దాకా.

ఈమధ్యనే రిటైరయాక, కట్టుకున్న సొంత ఇంట్లోకి ప్రవేశించాం. ఇల్లు విశాలంగా శుభ్రంగా ఉంది. తలుపులకీ, కిటికీలకీ 'మెష్' కూడా పెట్టించాం-దోమలూ, ఈగలూ దూరకుండా. కానీ, ఎలా దూరేవోగాని

చిన్నచిన్న ఎలకలు రావడం మొదలుపెట్టాయి. 'మోరీలు' ఎంత శుభ్రంగా మూసి ఉంచినా ఎలాగో, ఏ సందులోంచో దూరి వచ్చేవి. మా అత్తగారి దేవుడి మందిరంలోని అరటి పళ్లు మొదలుకుని వంటింట్లోని ప్లాస్టిక్ డబ్బాల వరకూ కొరికి చిల్లులు పెట్టడమే కాక, బల్లమీది న్యూస్‌పేపర్లూ, అలమారుల్లోని పుస్తకాలూ చిత్రవధ చెయ్యడం వరకూ వచ్చింది వాటి ఆగడం. ఎలకల బోను పెట్టి, వాటిని ఆకర్షించడం కోసం బ్రెడ్‌ముక్కలూ, కూరగాయముక్కలూ, ఏం పెట్టినా బోనుదాకా కూడా రాలేదు. ఉల్లిపాయ పకోడీలూ, మసాలావడలూ ఘుమఘుమ లాడుతూ చేసి పెట్టినా ఒకటీ అరా కక్కుర్తిపడి బోనులో పడ్డాయి కానీ, తక్కినవి 'మీ ట్రిక్కు మాకు తెలుసులే' అన్నట్లు బోనుకేసి దూరం నుంచే చూసి చకచకా పరుగెత్తుకుపోయేవి. డ్రాయింగ్‌రూమ్‌లో అతిథులు కూర్చుని ఉండగా ఎలక పిల్లలు యథేచ్ఛగా ఇటూ అటూ పరుగులెడుతూంటే సిగ్గుతో ముడుచుకుపోయేదాన్ని ఎలకలమందు అన్నంలో కలిపి ఈ మూలా ఆ మూలా పెట్టమని ఎవరో సలహా ఇచ్చారు కానీ, మాకు పాటించ బుద్ధి కాలేదు తీరా ఏమూలో ఎలక చచ్చిపోయి మనకు కనిపించకుండాపోతే, ఓ రోజు గడిచిందంటే ఇల్లంతా కంపుకొడుతుంది. ఎందుకొచ్చిన బాధ, ఎవో బుజ్జి ముండలు, ఇంట్లో కళకళ్లాడుతూ తిరుగుతున్నాయి, పోనీలే అని సరిపెట్టుకుందా మనుకున్నాను.

మా అత్తగారు ఊరుకోలేదు. 'మరీ ఇంత చాతకాని తనం ఏమిటి, ముష్టి ఎలకల్ని కూడా అదుపులో పెట్టుకో లేరూ? ఓ పిల్లిని నాలుగు రోజులు ఇంట్లో వదిలేస్తే సరి, ఎక్కడి ఎలకలు అక్కడే మాయమవుతాయి' అనడం మొదలు పెట్టారు.

నాలుగురోజులు మా ఇంటికి రావే అంటే ఏ పిల్లి వస్తుంది, దాని పద్ధతిలో అది వస్తుంది కాని! మా ఇంటికి ఎక్కడ చూసినా మెష్ తలుపులూ, కిటికీలూ. లోపలికి దూరడానికి సందులేదు. అటువంటి జైలు లాంటి ఇంట్లోకి రావడానికి ఏ పిల్లి సాహసిస్తుంది? పోనీ, చుట్టు పక్కల తిరిగే ఏ పిల్లినైనా ఎలాగో తీసుకొద్దామంటే దాని దరి దాపులకి వెళ్లడానికి నాకు భయం.

'అదేం చోద్యమమ్మా! పిల్లిని ఇట్టా పట్టుకుని అట్టా ఎలకని చూపిస్తే అదే నోట కరచుకుపోతుంది!' అంటూ, చాక్‌లెట్ కాగితం ఒలుచుకుని తినడం అన్నంత సులభమైనట్లుగా మాట్లాడే వారు మా అత్తగారు.

నా బాధ చూడలేక మా వారు ఓరోజున 'ఆ సూర్యారావు గారింట్లో ఓ పిల్లి పిల్లుంది. దాన్ని నాలుగు రోజుల పాటు మనింట్లో వదిలెయ్యమని చెబుతాను' అన్నారు. అడిగితే, వాళ్లు 'అలాగే' అన్నారుటగానీ, తీసుకొచ్చి వదిలి పెట్టలేదు.

ఓనాడు మధ్యాహ్నం బాల్కనీలో నిలబడి ఉండగా, దూరంగా మొక్కల మధ్య ఒక పిల్లిపిల్ల మిలమిల్లాడుతూ కనిపించింది. నేను వెంటనే 'మ్యావ్ మ్యావ్, దా' అన్నాను చెయ్యి ముందుకి చాచి. అది వెంటనే మూరెడు వెనక్కి పారిపోయి ఒక మొక్క వెనకాల నక్కి, నాకేసి బిక్కు బిక్కు మంటూ చూసింది. నేను గబగబా వంటింట్లోకి వెళ్లి, ఓ ప్లేటులో కొద్దిగా పాలుపోసి తీసుకొచ్చి, బాల్కనీలో దానికి కనపడేలా పెట్టి 'దా' అని పిలిచాను మళ్లీ. అది ఒక్క అడుగుకూడా ముందుకి వెయ్యలేదు. అలాగే గుడ్లు మిటకరించి చూస్తోంది. దానికి ఇంకా బాగా కనిపించేలా ప్లేటులో ఉన్న పాలు కొన్ని చుక్కలు క్రిందికి వాలకబోసి 'చూడు దా, ఇవిగో పాలు' అన్నాను. అది

కుతూహలంగా చూసిందే తప్ప ముందుకి రాలేదు. ఈ సారి ఇంకోలా ప్రయత్నించాను.

ఆ పాలప్లేటుని అక్కడే వదిలేసి నేను బాల్కనీలోంచి గదిలోకి వచ్చేసి, తలుపులు దగ్గరగావేసి, తలుపుసందులోంచి గమనించడం మొదలుపెట్టాను. ఆ పిల్లిపిల్ల అక్కడ ఎవరూ లేరని నిర్ధారించుకున్న తరవాత, మెల్లిగా మొక్కల చాటునుంచి ఇవతలకి వచ్చి, అడుగులో అడుగు వేసుకుంటూ, ఇటూ అటూ చూసుకుంటూ మెల్లిగా బాల్కనీ సమీపించింది. కొంచెం దూరంగా నిలబడి పాలప్లేటుకేసి తదేకంగా చూసింది. నేను చప్పుడు చెయ్యలేదు. అప్పుడది ముందు కొచ్చి పాల ప్లేటు దగ్గర వాసన చూసింది. ఓ సారి ఇటూఅటూ చూసి పాలదగ్గర మూతి పెట్టి మరోసారి వాసన చూసింది. మెల్లిగా తాగడం మొదలు పెట్టింది.

అది మొదలు రోజూ ఏదో ఒక సమయంలో తోటలోకి వచ్చి బాల్కనీకేసి చూసేది. వచ్చినప్పుడు నేను చూస్తే, ప్లేటులో పాలుపోసి బాల్కనీలో పెట్టేదాన్ని. నేనక్కడ నుంచి తప్పుకున్నాక అది వచ్చి పాలు తాగేసి మూతి నాక్కుంటూ వెళ్ళిపోయేది. ఓసారి అది పాలు తాగుతూండగా మెల్లిగా తలుపు తెరుచుకుని రెండడుగులు ముందుకి వేశాను. అది పాలు తాగడం ఆపి, వెనక్కి తిరిగి నా వైపు చూసింది. నేను కదలకుండా అలాగే నిలబడ్డాను. నేనేమీ చెయ్యనని ధైర్యం వచ్చింది కాబోలు, తాగడం కొనసాగించింది.

ఓ రోజున చుట్టుపక్కల ఆడుకుంటున్న పిల్లలు ఆపిల్లి పిల్లని పట్టుకోవడానికి ప్రయత్నించినట్లున్నారు. ఒక్క పరుగున మా బాల్కనీలోకి వచ్చి ఒక పూలకుండీ చాటున నక్కింది. నేను అది గమనించి

మెల్లిగా దాని దగ్గరగా వెళ్లాను. భయపడిపోతూ కుండీ పక్కనముడుచు కుని కూర్చున్న ఆ చిన్ని పిల్లి పిల్లని చూస్తే నాకు భయం వెయ్యలేదు. జాలేసింది క్రింద కూర్చుని దాని వీపు మీద మృదువుగా తాకాను—అది మరింత ముడుచుకుని వెనక్కి జరిగింది. నేను ఇంకొంచెం ధైర్యం చేసి దాన్ని నిమరడం మొదలు పెట్టాను. వీధిలో దాన్ని పట్టుకోవాలని చూసిన పిల్లలు గేటు దగ్గర చేరి 'అది మీదా ఆంటీ?' అన్నారు. మాదైతే ఎంత బావుండును-అని మనసులో అనుకుని, 'అవును' అన్నాను పైకి. 'దాని పేరేమిటి ఆంటీ?' అని అడిగారు.

'దీని పేరు... బ్రౌనీ' అన్నాను ఠక్కున. ఆ పిల్లి పిల్ల లేత బ్రౌన్ కలర్‌లోనే ఉంది. చూడగానే ఆపేరు తట్టింది.

నామకరణం జరిగిన ముహూర్తం మంచిదేమో, బ్రౌనీ మా ఇంట్లోకి రావడానికి ఒప్పుకుంది. అది బాల్కనీలోకి వచ్చి, 'మ్యావ్' మని పిలిచినప్పుడల్లా నేను తలుపుతెరిచేదాన్ని. ముందుముందు అనుమానంగా, తరవాత ధైర్యంగా లోపలికొచ్చేది. పాలప్లేటు వంటింటి గుమ్మం అవ తల పెడితే వచ్చి పాలు తాగేది. క్రమక్రమంగా పాలూ అన్నం, పెరుగూ అన్నం కలిపి పెడితే తినేది. తరవాత దాన్ని కాసేపు ఒళ్ళో కూర్చో బెట్టుకుని కబుర్లు చెబుతూ తల, వీపు, మెడ నిమిరేదాన్ని. ఎంతసే పయినా నిమిరించుకునేది. మెడనిమురుతూంటే ఆవుదూడలాగ, మేక పిల్లలాగ ఇంకా బాగా నిమరమన్నట్లు మెడ ఇంకా పైకెత్తేది కబుర్లు చెప్పడం (బుజ్జగిస్తూ మాట్లాడటం) మానేసి, నిశ్శబ్దంగా నిమురుతూంటే ఠక్కున తల పైకెత్తి నాకేసి చూసేది-నాతో కబుర్లు చెప్పడం ఆపే శావేం-అన్నట్లుగా.

దాని మూతి ఎర్రటి పెన్సిలుతో ఒంపుగా గీసినట్లు ఉండేది. దాని మెడ, పొట్ట తెల్లగా మెత్తగా సిల్కులా ఉండేవి. పొట్టమీద నిమిరితే మాత్రం కితకితలు పెట్టినట్లుండేదేమో, వెంటనే నిటాగ్గా లేచికూర్చుని ఒళ్ళంతా నాక్కునేది. చాలా హడావిడిగా పనిలో ఉన్నట్లు, నా ఉనికిని కూడా పట్టించుకోకుండా నాఒళ్ళో కూర్చుని తన ఒళ్లంతా నాక్కునేది. చేతిని (ముందు కాలుని) నాలుకతో తడి చేసుకుని, ఆ తడితో ముఖమంతా తుడుచుకునేది. చెంపలూ, చెవులూ, అన్నీ శుభ్రం చేసుకునేది ఆ తడితో.

ఓ రోజున అది నా ఒళ్లో ఉండగా బీరువా క్రింద ఎలక దూరడం చూసాను. నేను ఒక్క ఉదుటునలేచి, పిల్లిని అలమారు దగ్గర వదిలాను. పిల్లి కంగారుగా ఇటూ అటూ పరుగెత్తింది. నేను మూలనున్న గొడుగు తీసుకుని అలమారు క్రింద చప్పుడు చేశాను. ఎలక అలమారు క్రింద నుంచి బయటి కొచ్చి గోడవారగా మరో మూలకి పరుగెత్తింది.

'అదిగోనే ఎలక ! పట్టుకో, పట్టుకో!, అని అరిచాను బ్రౌనీ కేసి చూసి. నా అరుపులికీ, చేతిలో గొడుగునీ, పరుగెడుతున్న ఎలక పిల్లనీ చూసి బ్రౌనీ మరింత గాభరాపడిపోయి బయటికి పారిపోవాలని చూసింది. కాని, కిటికీలూ, బయటికి వెళ్లే తలుపులూ, అన్నీ మూసి ఉన్నాయి. అది గాభరాగా ఓ గదిలోంచి మరో గదిలోకి పరుగు లెత్తింది తలదాచుకోవడానికి.

ఈ వ్యవహారమంతా గమనించి మా అత్తగారు నవ్వుతూ 'ఎలకని చూసి భయపడే పిల్లిని ఎక్కడ సంపాదించావమ్మా' అన్నారు. వారం రోజుల నుంచి గమనిస్తున్నారావిడ— రోజూ నేను దానికి పాలు, అన్నం పెట్టడం, ఒళ్లో కూర్చోబెట్టుకుని దాని ఒళ్లు నిమురుతూ దాంతో కబుర్లు

చెప్పడం. 'పిల్లిని ఎలకలున్న చోటవదిలెయ్యాలి గాని, దానికి కడుపు నిండా పాలు పోసి ముద్దు చేస్తారా ఎవరైనా?' అని బుగ్గలు నొక్కుకున్నారు ముందు. ఆవిడ అన్నట్లుగానే ఆ పిల్లి పిల్ల ఎలకని పట్టుకోవ దానికి ప్రయత్నించక పోవడంతో ఆవిడకిప్పుడు వేళాకోళంగా ఉంది.

కాస్సేపయాక బ్రౌనీ ఎక్కడుందా అని అన్ని గదిల్లోనూ మూల మూలా వెతికాను. ఎక్కడా కనిపించలేదు. డ్రాయింగ్ రూమ్‌లో దివాన్ క్రింద ఏమైనా దూరిందేమోనని, నేను బాగా వొంగి, 'బ్రౌనీ, ఎక్కడున్నావే?' అన్నాను.

'ఊఁ' అంది క్రింద నుంచి—ఇక్కడున్నాను అన్నట్లుగా, బ్రౌనీ అంటే తనేనని దానికి అర్థమైందో, నా గొంతు గుర్తుపట్టి 'ఊ' అందో గాని, నేను పిలవగానే పలికినందుకు సంతోషం కలిగింది నాకు. వీధి తలుపు తెరిచి, 'ఇవ్వాల్టికి ఈ నిర్వాకం చాల్లే బయటికి పో' అన్నాను. 'థాంక్యూ' అన్నట్లు 'మ్యావ్' అని ఒక్క పరుగున బయటికి వెళిపోయింది.

అది ఎలకల్ని పట్టకపోయినా, ఇంట్లో మ్యావ్, మ్యావ్ అంటూ తిరుగుతూంటే ఎలకలు కనపడ్డం కొంచెం తగ్గినట్లే అనిపించింది. పాలు పొయ్యడం కాస్త ఆలస్యం అయితేచాలు, 'మ్యా మ్యా మ్యా మ్యా' అంటూ కాళ్లలో అడ్డంపడి హడావిడి చేసేది. అది అలా అంటూంటే 'అమ్మా అమ్మా అమ్మా...' అంటున్నట్లే అనిపించి మురిసిపోయేదాన్ని.

కానీ, బ్రౌనీ ఇంట్లో చనువుగా తిరగడం మా అత్తగారికేమో నచ్చలేదు. ఇదివరకు దేవుడి మందిరంలో ఆవిడ పెట్టిన అరటిపళ్లు ఎలకలు కొరికేస్తున్నాయని మొత్తుకునేవారు. ఇప్పుడు పిల్లిపిల్ల ఆ మందిరంలోకి

దూరి విగ్రహాలన్నింటినీ క్రిందామీదా పడేస్తున్నదని గోలపెడుతున్నారు. అది ఆవిడ గదిలోకి వస్తేచాలు కర్రపుచ్చుకుని గదిమేస్తున్నారు.

బ్రౌనీ రాత్రిళ్లు ఇంట్లో ఉండేది కాదు. పగలంతా సాధారణంగా నా మంచం క్రిందో, డ్రాయింగ్ రూమ్‌లో దివాన్ క్రిందో పడుకునేది. ఎవరైనా వీధిలో బెల్ కొడితే, నేను గబగబా తలుపు తియ్యడానికి వెడు తూంటే, అదికూడా ఛెంగున నా కాళ్లచుట్టూ మెలికలు తిరుగుతూ నా కడ్డొస్తూ నన్ను నడవనిచ్చేదికాదు. దాన్ని చేతుల్లోకి తీసుకొని అలాగే పట్టు కు తలుపుతీస్తే, గుమ్మంలో కనిపించిన వాళ్లని చూసి మళ్లీ ఛెంగున నా చేతిలోంచి దూకి ఏ మూలకో పారిపోయేది.

ఓ రోజున నేను మంచం మీద పడుకుని చదువుకుంటూంటే, పెద్దగా అలికిడైంది. ఏమిటని చూస్తే, బ్రౌనీ నోట్లో ఓ ఎలకని కరచు కుని అటూ ఇటూ కంగారుగా పరుగెడుతోంది. నేను ఉత్సాహంగా 'ఏమండీ, బ్రౌనీ ఎలకని పట్టింది, చూడండి, చూడండి' అని అరిచాను. మా అత్తగారూ, ఆయనా చెరోగదిలోంచి వచ్చారు హడావిడిగా, నాకేకలు విని. వాళ్లని చూడగానే బ్రౌనీ మరింత కంగారు పడిపోయి బీరువా క్రిందికి దూరింది. ఎలకనిచంపి ఇంట్లోనే తింటుందేమోనన్న భయంతో తలు పులుతీశాను బయటికి పంపించెయ్యడానికి. కాని అది ఎంత పిలిచినా బీరువా క్రిందనుంచి బయటికి రాలేదు. మా అత్తగారు తన చేతికర్ర పుచ్చుకుని బీరువా కింద టక టక లాడించారు. అది హడలిపోయి, ఇవతలికి పరు గెత్తుకొచ్చింది—నోట్లో ఎలకతో సహా కాని, మేము తెరిచిన తలుపు గుండా బయటికి పోవడానికి బదులు మా అత్తగారి గదిలోకి దూరి ఆవిడ బీరువా క్రిందికి చేరింది. ఆవిడ మరింత కోపంతో కర్ర టకటక లాడిం చారు. కర్రతో బీరువా క్రింద పొడిచారు. ఆ దెబ్బకి బ్రౌనీ ఆ ఎలక

పిల్లని అక్కడే పారేసి బయటికి పారి పోయింది. ఆ ఎలక పిల్ల అప్పటికే సహం చచ్చిఉంది. దాన్ని చీపురుతో తీసికెళ్లి తోటలో ఓ మూలకి విసి రేశాను.

బయట ఏం తిని వచ్చిందో, ఓ రోజున బ్రౌనీ డోకొస్తున్నట్లు బాధ పడుతోంది. దాన్ని తోటలోకి తీసికెళ్లి. ఎదురుగా చూస్తూ నిలబడ్డాను. అది అటూ ఇటూ వాసన చూస్తూ తిరిగి, ఓ చోట గడ్డి ఉంటే నాలుగు పరకలు కొరికి తింది. నేను తెల్లబోయాను. పిల్లి కూడా గడ్డి తింటుందని అప్పటి వరకూ నాకు తెలియదు. గడ్డి తిన్న కాస్సేపటికి డోక్కు-ంది. తరవాత కొంత సేపటికి తేరుకుంది. పాలు పోస్తే తాగలేదు. బాల్కనీలో తూము దగ్గర నిలవ ఉన్న నీళ్ళు చప్పరించి గోడవారనే సొమ్మసిలి పడుకుంది.

ఆ తరవాత కూడా బ్రౌనీ సరిగ్గాపాలు తాగేది కాదు. చిక్కి పోతోంది. దానికి ఎటువంటి ఆహారం ఇవ్వాలో, ఎలా బొద్దుగా చెయ్యాలో తెలియక, పిల్లుల మీద ఒక ఇంగ్లీషు పుస్తకం కనిపిస్తే కొని చదివాను. ఆ పుస్తకంలో పిల్లుల గురించి అన్ని ప్రాథమిక విషయాలతో బాటు, వాటి స్వభావాల గురించీ, ప్రవర్తన గురించీ ఎన్నో ఆసక్తి దాయక మైన సంగతులున్నాయి.

ఎక్కడైనా నేలమీద నీళ్లు సన్నగా మెలికలు తిరుగుతూ పారు తూంటే బ్రౌనీ దూరంగా నిటారుగా కూర్చుని తదేకంగా ఏదో విచిత్రాన్ని చూస్తున్నట్లు చూసేది నీళ్ళు ఎటువైపుకి పారుతూంటే అటువైపుకి తను కూడా పరుగెత్తి దాన్ని దీక్షగా చూసేది 'అది ఎలా చూస్తూందో చూడండి, ఎంత ముద్దుగా ఉందో అలా చూస్తూంటే' అని, మా వారికి చూపించే దాన్ని. అది మా బ్రౌనీ ప్రత్యేకత అనుకున్నాను. కాని, పిల్లిపిల్లలన్నీ

నీటి ప్రవాహాన్ని అలాగే వింతగా చూస్తాయని పుస్తకంలో రాసిఉంది. గుమ్మం తెరల కుచ్చెళ్ళు పట్టుకుని వ్రేలాడటం, ఏదైనా త్రాడు వ్రేలాడుతూంటే ఎగిరి దాన్ని పట్టుకోవడం, చిన్న ప్లాస్టిక్ బంతి, మూత, పెన్సిలూ లాంటి వాటితో ఫుట్‌బాల్ ఆడినట్లు ఆడుకోవడం—చూడముచ్చటగా ఉండేది.

వాటికి తిన్నది అరక్కపోతే గడ్డితిని జీర్ణకోశాన్ని అవే చక్కబరుచుకుంటాయనీ, సాధారణంగా వాటి వైద్యం అవే చేసుకుంటాయనీ, పిల్లులకు సహజంగా శుభ్రత ఎక్కువనీ, నాలుకతో ఒంటిని శుభ్రం చేసుకుంటాయనీ, వాటికి ఎవరూ స్నానం చేయించకూడదనీ, అవిమట్టిని కాలితో తవ్వి, చిన్నగుంట చేసి, ఆ గుంటమీద కూర్చుని 'దొడ్డికి' వెళ్ళి ఆ తరవాత కాలితో చుట్టూ ఉన్న మట్టిని తోసి ఆ గుంటని కప్పేస్తాయనీ ఇలా ఎన్నో అంతవరకూ నేను గమనించి తెలుసుకోని విషయాలను పుస్తకం చదివి తెలుసుకున్నాను. ఆడ పిల్లులికీ, మగ పిల్లులికీ తేడా తెలుసుకోవడం ఎలాగో ఆ పుస్తకం ద్వారానే తెలిసింది. మా బ్రౌనీ ఆడపిల్లి.

నేను ఆ పిల్లిమీద ఏ మాత్రం ప్రేమ చూపించినా మా అత్తగారికి ఒళ్ళు మండేది

'పిల్లిని పెంచకూడదు, కళ్ళు పోతాయి' అన్నారొకసారి.

'పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగుతుందని విన్నాను కానీ, పిల్లిని పెంచితే కళ్ళు పోతాయని ఎప్పుడూ వినలేదు' అన్నాను.

'అయ్యో! నీకు తెలియదు. పిల్లి ఎప్పుడూ యజమాని కళ్ళు పోవాలని కోరుకుంటుంది' అన్నారు.

'పిచ్చి ముండ!, దానికన్ని ఆలోచనలు ఎక్కడుంటాయండీ!' అన్నాను నవ్వుతూ. నా నవ్వు చూసి ఆవిడ ఉడుకు మోత్తనంతో' 'ఆ ముష్టి పిల్లి పాటి చెయ్యలేదు నా బ్రతుకు' అంటూ గొణుక్కుంటూ ఆవిడ గదిలోకి వెళ్లిపోయారు.

ఆవిడ కంటి చూపు క్రమంగా తగ్గడానికి కారణం ఆ పిల్లి పిల్లేనని ఆవిడ నమ్మడం మొదలెట్టారు. ఆవిడ ఆనందం కోసం బ్రౌనీని పంపించేద్దామన్నా అది వదిలేదు కాదు. తలుపు తెరిచినప్పుడు కాస్త సందు దొరికితే చాలు, లోపలికొచ్చేసి నా కాళ్ల వెనకాల పడేది. నేను కుర్చీలో కూర్చుంటే ఛెంగున ఎగిరి నా ఒళ్లో కూర్చునేది. మంచంమీద పడుకుంటే నాతలగడా పక్కన సర్దుకుని పడుకునేది.

ఓ రోజున ఆయన స్నానానికి వెడుతూ మంచంమీద తెల్లని ఇస్త్రీ ధోవతి మడత పెట్టుకుని వెళ్లారు. బ్రౌనీ వెళ్లి ఆ తెల్లని ధోవతి మడత మీద ముడుచుకుని పడుకుంది-ఆయన స్నానం చేసి వచ్చేసరికి. ఆయన అరుపులూ పెడబొబ్బలూ విని వంటింట్లోంచి ఒక్కపరుగున వెళ్లాను ఏమిటోనని.

'ఈ వెధవ పిల్లిని అవతల పారెయ్, వెధవ న్యూసెన్స్! ఊరుకుంటున్న కొద్దీ మరీ నెత్తికెక్కుస్తున్నావ్' అంటూ అరిచారు. మా అత్తగారు ఆయనకి వంతపాడారు. ఇంత హడావిడి జరుగుతున్నా బ్రౌనీ కదలకుండా, మెదలకుండా హంసతూలికాతల్పం మీద పడుకున్నట్లు హాయిగా పడుకుంది. 'బ్రౌనీ, లే' అన్నాను దాని వీపు మీద తట్టి.

'నాకిక్కడే బావుంది, నేను కదలను' అన్నట్లు నా వైపు ఒక్క చూపు చూసి ఇంకాస్త ముడుచుకుంది. ఉరిమి చూస్తున్న మావారిచూపుల్ని

భరించలేక, ఉక్రోషంతో బ్రౌని మెడమీద తోలు పట్టుకుని, దాన్ని తీసి కెళ్లి బాల్కనీలోంచి తోటలోకి విసిరేశాను. నేను వెనక్కి వెళ్లి తలుపులు వేస్తూంటే ఎప్పుడొచ్చిందో మెరుపులాగ, బ్రౌనీ నాకాళ్ల సందునే సక్కిందింది.

'ఇహ అయినట్టే...సంబడం!' అంటూ మూతీ, చేతులూ తిప్పుకుంటూ మా అత్తగారు ఆవిడ గదిలోకి వెళ్లిపోయారు.

ఓ రోజు సాయంకాలం పేరంటానికి వెళ్లాను పక్క వీధిలో తెలిసిన వాళ్లింటికి. సీమంతం పేరంటం-తతంగమంతా పూర్తయేసరికి ఒక గంట పైగా పట్టింది తిరిగి ఇంటికి బయలుదేరేటప్పటికి బాగా చీకటి పడిపోయింది. ఇంటికి వెళ్లి బెల్‌నొక్కాను. తలుపు తీస్తూనే గయ్ గయ్ మని అరిచారాయన. ఏమంటున్నారో ఏమిటో ఒక్కముక్క అర్థంకాలేదు. బిక్కు బిక్కు మంటూ లోపలికి అడుగుపెట్టి 'ఏమైంది?' అన్నాను.

మా అత్తగారికి భోజనానికి ఆలస్యమైపోయి బి. పి. ఎక్కువై పోయిందేమోనని భయపడ్డాను. కానీ ఆవిడ డ్రాయింగ్‌రూమ్‌లో కర్టెన్ ఒత్తిగించి తొంగి చూస్తున్నారు. మాకేసి!

'బ్రౌనీ ఏమన్నా పాడుచేసిందా?' అన్నాను తప్పు చేసినట్లు కుంచించుకుపోతూ.

'ఆ పిల్లిని ఎక్కడపెట్టి వెళ్లావో తెలుసా?' అని గర్జించారాయన.

'ఎక్కడ పెట్టడమేమిటి?' అన్నాను నాకేమీ అర్థం కాక. 'నేను సాయంకాలం వంట పూర్తిచేసి పేరంటానికి వెళ్లే హడావిడిలో అదెక్కడుందో కూడా చూడలేదు' అని నసిగాను.

'అదే అంటున్నాను. ఎక్కడుందో చూసుకోనక్కర్లేదా? సింగారించుకొని బయటికి పోతేసరా?' అన్నారు వెటకారంగా. మా వారి మాటలికి వంతపాడుతూ, 'అనవసరంగా బ్రహ్మహత్యాపాతకం చుట్టు కున్ను...నయమే' అంటూ దీర్ఘం తీశారు మా అత్తగారు.

నాకు ఒళ్ళుమండి, 'ఇంతకీ ఏమైందో చెప్పరేం? అని కసిరాను.

'ఆ పిల్లిపిల్లని నీ బీరువాలో పెట్టి తాళం వేసిపోయావు. నేను దాని అరుపులూ చప్పుళ్లూ విని బీరువా తలుపు తీశాను కాబట్టి సరిపోయింది. లేకుంటే ఈ పాటికి చచ్చి ఉండేది. బీరువాలో ఉంటుందని కలగంటామా? ఇల్లంతా వెతికాను. ఆ తరువాత నీ బీరువా తాళం కోసం వెతకలేక చచ్చాను' అన్నారు రొప్పుతూ.

'అయ్యయ్యో! నేను పట్టుచీర కోసం బీరువా తెరిచినప్పుడు అందులో దూరినట్టుంది, నేను చూసుకోలేదు ...బ్రౌనీ ఏదీ' అన్నాను గాభరాగా.

'బ్రౌనీ సంగతి అలా ఉంచి, ముందా బీరువా సంగతి చూడు— లోపల బట్టలన్నీ ఖరాబు చేసింది. ఈ సారి అలాంటి దేదైనా జరిగితే దాన్నీ నిన్నూకూడా వీథిలోకి విసిరేస్తాను' అని వార్నింగిచ్చి వీధిలోకి వెళిపోయారాయన.

నేను లోపలికి వెళ్లి బీరువా తెరిచి చూశాను. అట్టడుగు అరలో బట్టలన్నీ కెలికేసి ఉన్నాయి. సర్దుదామని బయటికి లాగేసరికి కంపు కొట్టింది. వాటిమీద దొడ్డికి వెళ్లినట్టుంది భయానికి! బట్టలు కూడా తడిసి పోయి ఉన్నాయి. వాటన్నిటినీ ఉతకడానికి తీసికెళ్లి బాల్కనీలో బకెట్‌లో పడేశాను తరవాత బీరువా అర అంతా ఫినైల్ పెట్టి తుడిచి ఆరబెట్టి, పొడైన బట్టలన్నీ శుభ్రం చేసేసరికి నా నడుం పడిపోయింది.

బ్రౌనీ అంతకు ముందు నా దగ్గరికి తప్ప ఇంకెవరి దగ్గరికీ చనువుగా వెళ్లేది కాదు. మా అత్తగారైతే దాన్ని చూడగానే కర్రెత్తి బెదిరించే వారు. ఆయన ఎప్పుడూ 'పో అవతలికి' అంటూ బెదిరించే వారు. అటువంటిది, ఆ బీరువా సంఘటన జరిగాక, బ్రౌనీ మా వారి కాళ్లని కూడా రాసుకు తిరగడం మొదలు పెట్టింది. ఎప్పుడూ లేనిది ఓసారి దాని ప్లేట్లో పాలు పోస్తూంటే చూశాను ఆయన్ని.

పిల్లి కాళ్లకు రాసుకుంటూ మన చుట్టూ తిరుగుతూంటే దాని ప్రేమని మనకి వ్యక్తం చేస్తున్న అనుభూతి కలుగుతుంది. వెంటనే మన హృదయం వెన్నలా కరుగుతుంది. దాని మీద మనం కూడా ప్రేమ చూపిద్దామని చంటిపిల్లని ఎత్తుకున్నట్లు చేతుల్లోకి తీసుకోబోతే మాత్రం గింజుకుని క్రిందికి దూకుతుంది. అది మన కాళ్లకి రాసుకుంటే దానికి పాలుపొయ్యాలి లేదా, ఏదైనా తినడానికి పెట్టాలి, లేదా క్రింద కూర్చుని దాని వీపు మీద, మెడ మీద నిమరాలి. అంతకు మించి ఏం చేసినా ఒప్పుకోదు.

మా వారు బ్రౌనీని కసరడం మానెయ్యడంతో దానికి ధైర్యం వచ్చి డ్రాయింగ్ రూమ్‌లో కుర్చీలో కూర్చోవడం మొదలు పెట్టింది. అతిథులున్నా సరే తప్పుకునేది కాదు. చిన్న పిల్లలొస్తే మాత్రం బెదిరి పారి పోయేది. దాన్ని పట్టుకుందామని వాళ్ళు ఎంత ప్రయత్నించే వారో అది అంత దూరంగా తప్పించుకుని ఏ మూలో దాక్కునేది.

దానికి సాల్టు బిస్కట్లూ, జంతికలూ, చక్కవడలూ, ఇలాంటి కరకర లాడే టిఫిన్లు ఇష్టం. ఎవరికైనా పెట్టేముందు దానిక్కూడా కొంచెం నేలమీద పడెయ్యాలి. లేకపోతే ప్లేటు అందుకోవడానికి పైకి గెంతుతుంది.

బ్రౌనీని ఇలా ముద్దు చెయ్యడం చూస్తూంటే కారాలూ మిరియాలూ నూరి ఒంటికి రాసుకున్నట్లుగా ఉండేది మా అత్తగారికి. ఈ విషయంలో ఇప్పుడు ఆయన కూడా నాతో కలవడంతో ఆవిడకి మరింత మంటగా ఉంటోంది.

ఓనాడు మధ్యాహ్నం మా అత్తగారు తన గదిలో మంచంమీద వెల్లకిలా పడుకుని సీలింగ్ కేసి శూన్యంగా చూస్తున్నారు గతాన్ని నెమరు వేసుకుంటున్నట్లు. కుడి చెయ్యి గుండెల మీద పెట్టుకుని, ఎడం చెయ్యి చాచుకుని పడుకుని ఉన్నారు-నేను హార్లిక్స్ గ్లాసు తీసుకుని వెళ్ళేసరికి.

'ఇదిగో, హార్లిక్స్ తీసుకోండి' అన్నాను.

'అక్కడ పెట్టు' అన్నారు సీలింగ్ కేసి చూస్తూనే.

'త్వరగా తీసుకోండి. చల్లారి పోతుంది' అని చెప్పి ఇవతలకి వచ్చేశాను. నేను ఇలా వంటింట్లోకి తిరిగి వచ్చానో లేదో, అవిడ కెవ్వుమని అరిచారు. వేడి హార్లిక్స్ ఒంటిమీద పోసుకున్నారేమో నని హడలిపోయి వెనక్కి వెళ్ళాను. తీరా చూస్తే, అవిడ ఎడమచేతి మధ్య వేలు మీంచి రక్తం బొట్లు పడుతున్నాయి. ఆవిణ్ణి చూసి నిర్ఘాంతపోయాను. ఆవిడ ఆచెయ్యి పట్టుకుని లబోదిబోమంటున్నారు.

'ఇంతలోనే ఏమయిందండీ?' అంటూ ఇటూ అటూ చూసాను. సరిగ్గా అప్పుడే బ్రౌనీ ఆవిడ మంచం క్రింద నుంచి బయటికి వచ్చి తుర్రుమని బయటికి పారిపోయింది.

'ఆపిల్లి ముండకి నేనంటే కచ్చ! చూడు, ఎట్లా కరిచి పోయిందో' అన్నారు మా అత్తగారు.

ఆవిడ వేలు పట్టుకుని చూశాను. బ్రౌనీ గోరు దిగినట్లుగా అనిపించింది. కరచి ఉండదు అనిపించింది. వెంటనే డెట్టాల్‌తో తడిపిన దూదితో వేలు తుడిచి, కొంచెం టెర్రామైసిన్ ఆయింట్‌మెంట్ రాసి, కట్టు కట్టాను. తరవాత ఆయనకి ఫోన్ చేసి జరిగింది చెప్పాను; ఆయన వచ్చేటప్పుడు డాక్టర్ని తీసుకొచ్చారు. డాక్టరుగారు 'యాంటీటెటనస్' ఇంజక్షన్ ఇచ్చి, 'ఏం పరవాలేదు మామ్మగారూ, కాస్సేపటికి బాధ తగ్గిపోతుంది లెండి, భయపడకండి' అని ధైర్యం చెప్పి వెళ్ళారు.

బ్రౌనీ అంటే మావారికి మళ్ళీ కోపం తిరగబెట్టింది 'దాన్ని ఇంట్లోంచి వెళ్ళగొడతావా, లేదా?' అని కూర్చున్నారు.

'దాన్ని పొమ్మన్నా మళ్ళీ వస్తోంది కదండీ, నేనేం చెయ్యను?' అన్నాను.

'పాలు పొయ్యకుండా ఉంటే అదే పోతుంది. దానికి జంతికలూ బూందీ, పకోడీలూ చేసి పెడుతూంటే ఎందుకు పోతుందదీ? ఈ ఇంట్లో అది ఉండాలో, నేనుండాలో తేల్చుకో' అంటూ హుంకరించి వీధిలోకి వెళ్ళిపోయారు.

బ్రౌనీని మెడ పట్టుకుని బయటికి పంపేసి, తలుపువేసేశాను. నేను తల పట్టుకుని కుర్చీలో కూలబడ్డాను.

పట్టుమని పది నిముషాలు కాలేదు. 'మ్యావ్' అని వినిపించింది. నేను తలని పక్కకి తిప్పి తలుపుకేసి చూశాను. మెష్ తలుపుకి అవతల బ్రౌనీ నిలబడి నాకేసి దీనంగా చూస్తూ

'మై... ఆవూఁ?' అంది.

అలవాటు చొప్పున చటుక్కున కుర్చీలోంచి లేవబోయాను తలుపు తియ్యడానికి. అంతలోనే ఆయన సంధించిన బ్రహ్మాస్త్రం నన్ను బంధించి నట్లైంది.

నిస్త్రాణగా కుర్చీలో కూలబడి, 'నహీఁ' అన్నాను నిస్సహాయంగా.

(జ్యోతి, సెప్టెంబరు' 88)